క్లుప్తంగా

పాఠశాలలో ఫేర్‌వెల్ హంగామా



కార్యక్రమం ప్రారంభిస్తున్న యాదగిరిగౌడ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీలోని విశ్వభారతి విద్యాసంస్థల ఫేర్‌వెల్ హంగామా మంగళవారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, హెచ్‌ఎంలు తిరుపతిగౌడ్, నోయల్ జోసఫ్ పాల్గొన్నారు.

కళాశాలలో వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నర్సయ్యపల్లి గ్రామంలో విజయ ఏసీ గార్డెన్‌లో స్థానిక శ్రీవాణి జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షిక వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా డాక్టర్ రేకులపల్లి విజయ, కరస్పాండెంట్ శశాంక్, ప్రిన్సిపాల్ బాలు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు



విద్యార్థుల నృత్య ప్రదర్శన

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల యూనివర్సల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్, హెచ్‌ఎం.అఫ్జల్ పాల్గొన్నారు.

పెద్దాపూర్ 'ఆదర్శ'లో వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ విద్యాలయంలో మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాలలో వేడుకలు పలికారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. ప్రిన్సిపాల్ షాదుల్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని చైతన్య హైస్కూల్‌లో 2004–05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం స్థానిక మార్కండేయకాలనీలోని ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన గురువులకు సన్మానం చేశారు. గురువులు శ్రావణ్, విజయ, మల్లేశ్, సత్యం, రామ్‌రెడ్డి, మల్లేశ్, ప్రకాశ్, పూర్వ విద్యార్థులు మల్లేశ్, శ్రీధర్, సతీశ్, నరేశ్, శ్రీకాంత్, అరుణ్, రాము, శ్రవణ్, కుమార్, తిరుపతి, జాకీర్, క్రాంతి, కల్పన, రజిత, ఫర్హీన్, ప్రియాంక, మౌనిక, గౌతమి, జ్యోతి పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కమాన్‌పూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్యను గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సతీశ్, రాము, శంకర్, సదానందం, అజయ్, తిరుపతి, శ్యాం, శ్రీనివాస్, ప్రశాంత్, సంతోష్ పాల్గొన్నారు.



సుల్తానాబాద్: శివాలయానికి అలంకరణ



జూలపల్లిలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం



ఎలిగేడు: రాములపల్లి నాగలింగేశ్వరాలయం

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

సుల్తానాబాద్: పట్టణంలోని పలు శివాలయాల్లో మహాశివరాత్రి కోసం ఆలయ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు, తెల్లవారుజాము నుంచి శివుడికి క్షీరాభిషేకం, అన్నపూజ నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ పేర్కొన్నారు.

కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

ఎలిగేడు: మండలంలోని రాములపల్లి (ర్యాకల్‌దేవుపల్లి)లోని శ్రీనాగలింగేశ్వరాలయం, ఎలిగేడులోని శ్రీభవాని రామలింగేశ్వరాలయం, ధూళికట్టలోని శివాలయాలు కల్యాణానికి ముస్తాబు చేశారు. శుక్రవారం శ్రీనాగలింగేశ్వర ఆలయంలో ఉదయం ప్రభాతసేవ, ధ్వజారోహణం, అభిషేకం, బిల్వార్చన, క్షీరాభిషేకం, ఎదుర్కోళ్లు, రుద్రాభిషేకం, పల్లకిసేవ, కోడె కట్టుట, 11.45గంటలకు నాగలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు వడ్కాపూర్ శివాలయం, జూలపల్లి, కోనరావుపేట, తేలుకుంట గ్రామాల్లోని శివ భక్తమార్కండేయ ఆలయాల్లో శివ పార్వతుల కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



ముత్తారం: అపర కాశీగా పేరున్న బహుగుళ్లకు రూ.2కోట్లతో రోడ్డు నిర్మాణం, విద్యుత్ లైన్ సరే కానీ రోడ్డును ఆనుకొని ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావుల గురించి పట్టించుకునే వారు లేరు. మంత్రి శ్రీధర్‌బాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2కోట్లతో 2.3కి.మీల సీసీ రోడ్డు, రూ.12లక్షలతో విద్యుత్ లైన్ సౌకర్యం కల్పనపై స్థానికులు, భక్తులు సంబర పడుతున్నారు. మచ్చుపేట ప్రధాన రోడ్డు నుంచి బహుగుళ్ల దేవాలయం వరకు 7 వ్యవసాయ బావులు రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు కనీసం ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. బుధ, గురువారం జరిగే శివరాత్రి ఉత్సవాలకు వందలాది భక్తులు బహుగుళ్ల ఆలయానికి వచ్చి పవిత్ర స్నానాలతో మొక్కులు తీర్చుకుంటారు. మంథని గోదావరిలో నీరు లేకపోవడంతో అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. శివరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాదకరంగా ఉన్న బావుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

బీజేపీకి ఓట్లు అడిగే నైతిక అర్హత లేదు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్ నిధులు కేటాయించారని బీజేపీ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక అర్హత లేదని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై బండి, కిషన్‌రెడ్డి చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నయాపైస తీసుకురాని బండి సంజయ్, కిషన్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పట్టభద్రులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, వైస్‌చైర్మన్ అరిగె లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు యశోద అజయ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, మాజీ ఎంపీటీసీలు బద్దం అజయ్‌పాల్ రెడ్డి, బొల్లి స్వామి, సంతోష్ పాల్గొన్నారు.

ఆదాయ పన్ను ప్రణాళికపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్

గోదావరిఖని: ఆదాయపు పన్ను ప్రణాళికలపై అవగాహన సదస్సును మంగళవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్ మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల ఆదాయపు పన్ను మినహాయింపు ప్లానింగ్ ఏవిధంగా చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మీభాయి, సీనియర్ పీవో హనుమంతరావు, సారంగపాణి, ఐసీఐసీఐ బ్యాంక్ జోనల్ హెడ్ సతీశ్‌పాల్‌రెడ్డి, రీజినల్ హెడ్ రవీందర్‌రావు, బ్రాంచ్ మేనేజర్ హుస్సేన్, సీఏ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన





సుల్తానాబాద్: పరిశీలిస్తున్న తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎలిగేడు: పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఏర్పాటును తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ మంగళవారం పరిశీలించారు. 27న పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పలు కేంద్రాలను సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఆర్ఐ వినోద్ ఉన్నారు.

ఎలిగేడు: ఎలిగేడు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అరిఫ్ పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాల హెచ్‌ఎం దేవేందర్‌రావు, కార్యదర్శి అంజలి ఉన్నారు.

ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బషీరోద్దీన్ తెలిపారు.

ధర్మారం: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ వకీల్, ఎస్సై శీల లక్ష్మణ్ పరిశీలించారు. ధర్మారం మండలంలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తహసీల్దార్ వకీల్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఆర్ఐలు వరలక్ష్మి, నవీన్‌రావు ఉన్నారు.

నిరంతరం పట్టభద్రుల సేవలో ఉంటా



మాట్లాడుతున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

గోదావరిఖని: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరంతరం పట్టభద్రుల సేవలో ఉంటానని ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను మేయర్‌గా ఉన్న కాలంలో ఒక రూపాయికే నల్లా, ఒక రూపాయికే అంత్యక్రియలు, సరస్వతి ప్రసాదం, సమ్మర్ క్యాంపు నిర్వహించి దేశప్రధాని మోడీతో అభినందనలు అందుకున్నానన్నారు. పట్టభద్రుల పక్షాన ఉండి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



సుల్తానాబాద్: వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు



ఓదెల: స్వీటు తినిపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సుల్తానాబాద్: పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం చేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.

ఓదెల: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎలిగేడు: ఎలిగేడు మండల కేంద్రం బస్టాండు ఆవరణలో స్వీట్లు పంపిణీ చేశారు.

జూలపల్లి: జూలపల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషిచేయాలి



మాట్లాడుతున్న ఏసీపీ రమేశ్

మంథని: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాల సాధన కోసం నిరంతరం కృషి చేయాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ అన్నారు. మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన వార్షిక వేడుకల్లో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఏసీపీ మాట్లాడుతూ సెల్ ఫోన్లు మంచికి బదులు చెడుకే ఎక్కువ ఉపయోగిస్తున్నారన్నారు.

పేద బిడ్డకు సాయం ఏది?

మంథని: కాటారం మండల కేంద్రానికి చెందిన జ్యోత్స్న అనే పేద బిడ్డకు మెడికల్ సీటు వచ్చి ఫీజు కట్టలేని స్థితిలో ఉందని తెలిసినాఆ కాంగ్రెస్ నాయకులు ఎందుకు సాయం చేయడం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. మంగళవారం మంథనిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్యోత్స్న తండ్రి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడని, సాయం చేయాలని నెలరోజుల క్రితం సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలు చక్కర్లు కొట్టాయని ఆ కుటుంబానికి సాయం చేయాలనే ఆలోచన కాంగ్రెస్‌కు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు.

సంక్షిప్త వార్తలు

• ఎన్టీపీసీలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

జ్యోతినగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి మంగళవారం ప్రచారం చేపట్టారు. అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్, టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ప్రచారం చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సాగర్‌రావు, పాలాస రాజు, సాధుల రాంబాబు పాల్గొన్నారు.

• భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

గోదావరిఖని: మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు గోదావరినదితీరంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని టీడీపీ నాయకులు నిమ్మకాయలు ఏడుకొండలు, ముదిగంటి దామోదర్‌రెడ్డి కోరారు. గోదావరినదిలో నీరు ఇంకిపోయిందని, తక్షణమే ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలన్నారు. శివరాత్రి సందర్భంగా వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

• సమస్యలుంటే నేరుగా తెలియజేయవచ్చు

మంథని: మంథని సామాజిక వైద్యశాలలో ఏమైనా సమస్యలుంటే తెలియజేయాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డా.శ్రీధర్ సూచించారు. సామాజిక ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేసి అనేక సూచనలు చేశారన్నారు. స్త్రీ వైద్య నిపుణురాలిని నియమించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు.

• చికెన్ సెంటర్ల పరిశీలన

సుల్తానాబాద్: చికెన్ సెంటర్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ ఆదేశించారు. పట్టణంలోని పలు చికెన్ సెంటర్లను మంగళవారం ఆయన పరిశీలించారు. చికెన్ వ్యర్థ పదార్థాలు రోడ్డు పరిసర ప్రాంతాల్లో వేయొద్దని సూచించారు.

• అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ముత్తారం: అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయాధికారి అనూష సూచించారు. మండలంలోని అడవిశ్రీరాంపూర్, ముత్తారంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.

• వెంటపడి వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను వేధించిన పిట్టల రాజేశ్(37)పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. కొన్ని రోజులుగా రాజేశ్ వెంటపడుతూ వేధించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• శివాలయాల్లో ఏర్పాట్లు పరిశీలన

గోదావరిఖనిటౌన్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకోదండ రామాలయం, జనగామలోని శివాలయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్ శనివారం పరిశీలించారు.

• ఎంపీడీవోకు సన్మానం

సుల్తానాబాద్: ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సుల్తానాబాద్ ఎంపీడీవో దివ్యదర్శన్ రావును మంగళవారం ఆయన కార్యాలయంలో టీపీఆర్‌ఎంటీఏ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు రవి, ఉద్యోగులు సన్మానించారు. యూనియన్ నాయకులు ఎం.రమేశ్ కుమార్, మనోహర్‌రెడ్డి, సతీశ్, రవి, అంజయ్య, మహేశ్వర్‌రెడ్డి, ఉపేందర్, మధుసూదన్, శివకుమార్ పాల్గొన్నారు.

• జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్

రామగిరి: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌రావును మంగళవారం సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఫెర్టిలైజర్‌సిటీ: ప్రధానమంత్రి నరేంద్రమోడీని విమర్శించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందని, హామీలను విస్మరించిన కాంగ్రెస్‌తో పోరాడేది బీజేపీ ఒక్కటేనని పార్టీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లి, 38వ డివిజన్ ఇందిరానగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఒక పార్టీ పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి పోటీలోనే లేకుండా పోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 317 జీవోను సవరిస్తామని మీడియా సమావేశంలో తెలియజేయాలని సవాల్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేస్తామన్న సీఎం ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని కోరారు. టీచర్స్ ఎమ్మెల్సీ జిల్లా ఇన్‌చార్జి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్‌చార్జి అల్లాపూర్ శ్రీనివాస్, నాయకులు గోమాస శ్రీనివాస్, సోమారపు లావణ్య, కందుల సంధ్యారాణి, బల్మూరి వనిత, సుల్వ లక్ష్మీనర్సయ్య, కాసిపేట శివాజీ, బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పాల్గొన్నారు.

కాసేపు ఆటవిడుపు

గోదావరిఖని: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ గోదావరిఖనిలో కొద్దిసేపు ఉల్లాసంగా గడిపారు. స్థానిక ఇందిరానగర్‌లో ఎస్‌వీ స్పోర్ట్స్ బాక్స్ క్రికెట్ అసోసియేషన్, ఎక్స్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు గంగరాజు, నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్‌ను వీక్షించి అనంతరం కాసేపు బ్యాటింగ్ చేశారు. నాయకులు గోమాస శ్రీనివాస్, కందుల సంధ్యారాణి ఉన్నారు.

సింగరేణి ఉద్యోగులకు ఉచిత వైద్యసేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

కోల్‌సిటీ: గోదావరిఖని విజయ్‌నగర్‌లో సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం మంగళవారం కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు 120 మందికి ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. వైద్య శిబిరంలో కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గట్ల రమేశ్, 43వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.రామస్వామితోపాటు ఎ.కృష్ణ, మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీశ్, యూనస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం



రామగుండం: ప్రచారంలో హర్కర వేణుగోపాలరావు

రామగుండం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు పట్టభద్రులను అభ్యర్థించారు. మంగళవారం పట్టణ కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సుల్తానాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. పట్టణంలోని పూసాల వద్ద మంగళవారం కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

సీపీఎం మద్దతు

జ్యోతినగర్: పట్టభద్రుల నియోజవర్గ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి సీపీఎం మద్దతు తెలుపుతున్నట్లు సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి తెలిపారు. అన్నపూర్ణకాలనీలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆరోపించారు.

ఎలిగేడు: పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దుగ్యాల సంతోష్‌రావు కోరారు. మండల కేంద్రంతోపాటు ధూళికట్ట, లాలపల్లి, శివపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని మంగళవారం యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు.

అవతార్ మెహర్ బాబా జయంతి

గోదావరిఖనిటౌన్: స్థానిక అడ్డగుంటపల్లిలో అవతార్ మెహర్ బాబా మందిరంలో అవతార్ మెహర్ బాబా జయంతి శనివారం నిర్వహించారు. ముందుగా మందిరంలో జెండా ఆవిష్కరించారు. అడ్డగుంటపల్లి నుంచి కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్ వీధుల గుండా బాబా ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహంకాళి స్వామి, నాయకులు బాలరాజ్‌కుమార్, గట్ల రమేశ్, ఎండీ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



పెగడపల్లి విశ్వేశ్వరాలయంలో కల్యాణం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి విశ్వేశ్వరాలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాండవుల గుట్ట జ్ఞానమానీశ్వరాలయంలో శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల కల్యాణోత్సవంలో భాగంగా పీఠాధిపతులు బసవత్తుల రాజమౌళి ఆచార్యుల నేతృత్వంలో ఎదుర్కోళ్ల ఘట్టం వైభవంగా జరిగింది. వేద పండితులు మహేశ్వరశర్మ, సతీశ్‌శర్మ కల్యాణం జరిపించారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ సర్పంచులు మల్లారెడ్డి, రాజమల్లు, సుజాత, సతీశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.